పాతపంటల జాతరలో ఎడ్ల బండ్లకు స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, మహిళలు

పాతపంటలను కాపాడుకోవాలి

జహీరాబాద్, జనవరి 25: భవిష్యత్తు తరాల కోసం పాత పంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పస్తాపూర్ డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ పాతపంటల జాతర కోఆర్డినేటర్ వినయ్‌కుమార్ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం జంగార్‌బోలి తండాలో 25వ పాతపంటల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పంటలైన తైదలు, కొర్రలు, సామలు, సజ్జ, జొన్న, పెసర, మినుము తదితర పంటల్లో అనేక పోషకాలు అధికంగా ఉంటాయని, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. కనుమరుగవుతున్న పాతపంటలను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం తండాలో ప్రధాన వీధుల గుండా డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు, మహిళల కోలాటం, చిటికెల రామాయణం, ఆటపాటలతో పాతపంటల విత్తనాలతో కూడిన ఎడ్ల బండ్లతో ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం మట్టి పరీక్ష నిపుణులు స్వామి, డీడీఎస్ జాతర కోఆర్డినేటర్ మంజుల, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు చంద్రమ్మ, పూలమ్మ, నర్సమ్మ, బాలయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలందరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

కంది, జనవరి 25: ఖైదీలందరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర అన్నారు. శనివారం కందిలోని సెంట్రల్ జైల్‌లో ఖైదీల హక్కులు అనే అంశంపై న్యాయపరమైన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ శిక్ష అనుభవిస్తూ న్యాయ సహాయం కావాల్సిన ఖైదీల కోసం ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నామన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత మరోసారి తప్పులు చేయకుండా మంచి జీవితం గడపాలని సూచించారు. ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం జైలులో ఖైదీలకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ సంతోషికుమార్‌రాయ్, డిప్యూటీ సూపరింటెండెంట్ భరత్‌రెడ్డి, జైలర్ మహిపాల్‌రెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి భవానీచంద్ర



సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్క్‌లో రాజ్యసభ్యుల బృందం

మెడికల్ డివైజ్ పార్కులో ఎంపీల బృందం

అమీన్‌పూర్, జనవరి 25 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కులోని రెండు కంపెనీలను శనివారం నలుగురుతో కూడిన రాజ్యసభ సభ్యుల బృందం సందర్శించింది. SMT, ఆకృతి మెడికల్ డివైజ్ కంపెనీలను ఎంపీల బృందం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మ్యూటికల్స్ అండ్ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులతో కలిసి సందర్శించింది. బృందంలో నిరంజన్ దాస్ గుప్తా, భామ రేబియా, సుభాష్ కుంతియా, రంగువార నర్కార్య ఉన్నారు.

రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అందోల్, జనవరి 25: అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం చైర్మన్ మల్లయ్య, కమిషనర్ తిరుపతి కౌన్సిలర్ పిట్ల లక్ష్మణ్‌భాగ్యలక్ష్మితో కలిసి ప్రారభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం కోసం నిరంతర కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు సురేందర్ గౌడ్, దుర్గేశ్, నాగరాజు, హరికృష్ణ గౌడ్, సుమిత్రసత్యం, ప్రవీణ్, వెంకటేశం పాల్గొన్నారు.

2వ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు

క్రీడలతో మానసికోల్లాసం

రామచంద్రాపురం, జనవరి 25: క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందుతుందని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ అన్నారు. శనివారం తెల్లాపూర్ గేటెడ్ కమ్యూనిటీలో టీనా ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. గేటెడ్ కమ్యూనిటీవాసులకు వాలీబాల్, త్రోబాల్, చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, టెన్నీస్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీనా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ రోజూ కొంత సమయాన్ని వ్యాయామం, క్రీడలకు కేటాయిస్తే ఆరోగ్యవంతమైన జీవితానికి అడుగులు వేసినట్టేనని తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగరీత్యా సమయభావంతో ప్రతిఒక్కరూ శారీరక శ్రమకు దూరమవుతున్నారని, తద్వారా రోగాలబారిన పడుతున్నామని చెప్పారు. క్రీడలతో శారీరక శ్రమ, మానసికోల్లాసంతో పాటు స్నేహభావం పెరుగుతుందన్నారు. టీనా ఆధ్వర్యంలో ప్రతి ఏడాది గేటెడ్ కమ్యూనిటీవాసులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీనా సభ్యులు, కిసాన్ జిల్లా మోర్చా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గేటెడ్ కమ్యూనిటీలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

చట్టాలపై అవగాహన ఉండాలి

జహీరాబాద్, జనవరి 25: ప్రతి విద్యార్థికి చదువుతో పాటు చట్టాలపై అవగాహన ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు కృష్ణవేణి పాఠశాలలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ విద్యార్థులు నిత్య జీవితంలో చిన్న చిన్న సమస్యలను ఎదుర్కోడానికి చట్టాలు తోడ్పడుతాయన్నారు. క్రమశిక్షణతో విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం న్యాయవాదులు జూవైనల్ జస్టిస్, పోక్సో చట్టం, సమాచార హక్కు చట్టం, బాల్య వివాహాలు, బాల కార్మిక నిర్మూలన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ గోపాల్, వైస్ ప్రెసిడెంట్ మానెన్న, న్యాయవాదులు రాఘవేంద్ర నాయక్, సోమశేఖర్, విజయ్‌కుమార్, రుద్రయ్యస్వామి, రామకృష్ణ, లావణ్య, బుజ్జమ్మ, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, లీగల్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ

ఓటుహక్కును వినియోగించుకోవాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 25: దేశ భవిష్యత్తు ఓటర్ల చేతుల్లోనే ఉందని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం జిల్లా ఐసీసీ ఆడిటోరియంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటు ప్రాముఖ్యతపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు అనేది పౌరుడి హక్కు మాత్రమే కాదని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తివంతమైన ఆయుధమన్నారు. అనంతరం ఉద్యోగులు, విద్యార్థులతో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన సీనియర్ సిటిజన్లను సన్మానించారు. నూతనంగా ఓటరుగా నమోదు చేసుకున్న వారికి ఓటరు గుర్తింపు కార్డులను కలెక్టర్ అందజేశారు. అంతకుముందు స్థానిక ఐబీ నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, డీఏవో శివప్రసాద్, జేఎండీఏసీ తుల్జానాయక్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఏవో పరమేశ్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఆంథోనీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలి

జహీరాబాద్, జనవరి 25: ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని జహీరాబాద్ డివిజనల్ రెవెన్యూ అధికారి రాంరెడ్డి ఆన్నారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జహీరాబాద్ పట్టణంతోపాటు న్యాల్‌కల్, మొగుడంపల్లి మండల కేంద్రాల్లోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాగారెడ్డి స్టేడియంలో అధికారులు, విద్యార్థులు, ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు అమూల్యమైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర్‌రావు, ఆయా మండల తహసీల్దార్లు రవీందర్, భూపాల్, హసీనాబేగం, డిప్యూటీ తహసీల్దార్ రాజి రెడ్డి, మండల అభివృద్ధి అధికారి రాజేందర్‌రెడ్డి, విద్యాధికారి బస్వరాజ్, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాములు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

జహీరాబాద్‌లో ర్యాలీని నిర్వహిస్తున్న ఆర్డీవో రాంరెడ్డి

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

రాయికోడ్, జనవరి 25: సమాజంలో ఓటుహక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. రాయికోడ్‌లో తహసీల్ కార్యాలయం నుంచి గ్రామ పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ సమాజంలో ఓటు హక్కు అమూల్యమైనది అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఎం షరీఫ్, మండల విద్యాధికారి అంజయ్య, ఉప తహసీల్దార్ విజయకుమార్, ఉన్నారు.

గుమ్మడిదలలో జాతీయ ఓటరు దినోత్సవం

గుమ్మడిదల, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రెవెన్యూ అధికారులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. గుమ్మడిదలలో తహసీల్దార్ గంగాభవాని, నాయబ్ తహసీల్దార్ కరుణాకర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం సుబ్బలక్ష్మి, ఉపాధ్యాయులు కలిసి జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో టు ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీని నిర్వహించారు.

కోహీర్‌లో ఓటరు దినోత్సవం

కోహీర్, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని కోహీర్ పట్టణంలోని తహసీల్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ బాలశంకర్ సమక్షంలో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నాయబ్ తహసీల్దార్ వర ప్రసాద్, ఆర్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

కోహీర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ బాలశంకర్

ఓటరు దినోత్సవంపై చైతన్య ర్యాలీ

జిన్నారం(బొల్లారం) జనవరి 25: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిన్నారంలో తహసీల్దార్ భిక్షపతి ఆధ్వర్యంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ...18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో కమిషనర్ మంగతాయారు ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

రాయికోడ్‌లో ఓటు హక్కు ప్రాధాన్యతపై ర్యాలీ తీస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

గుమ్మడిదలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ గంగాభవాని, ఉపాధ్యాయులు

జిన్నారంలో ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ భిక్షపతి, అధికారులు

82 అంశాలకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం

సదాశివపేట, జనవరి 25: సదాశివపేట మున్సిపల్ సాధారణ చివరి కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ అపర్ణాశివరాజ్‌పాటిల్ అధ్యక్షతన శనివారం జరిగింది. మొత్తం 82 ఎజెండా అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇప్పటివరకు సదాశివపేట అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సహకరించిన కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వైస్‌చైర్మన్ చింతా గోపాల్ మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. పార్టీలకు అతీతంగా సదాశివపేటను అభివృద్ధి చేశామన్నారు. పేట అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధిలో భాగస్వాములైన కౌన్సిల్ సభ్యులు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను మున్సిపల్ సిబ్బంది జ్ఞాపికలను అందజేసి శాలువాలతో సన్మానించారు. అంతకుముందు

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణాశివరాజ్‌పాటిల్

13వ వార్డు కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం మాట్లాడుతూ సిద్దాపూర్ సమీపంలో డంపింగ్‌యార్డు ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. కౌన్సిలర్లు ఇలియాజ్ షరీఫ్, ఖుద్దూస్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, తగు చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమ, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, చౌదరి ప్రకాశ్, ఇంద్ర మోహన్ గౌడ్, విద్యాసాగర్‌రెడ్డి, ఆకుల శివ కుమార్, నాగరాజుగౌడ్, గుండురవి, కో ఆప్షన్ సభ్యుడు కోడూరి అంజయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసిన వీఎన్ఆర్ కళాశాల బృందం

ఝరాసంగం, జనవరి 25: పదో తరగతి పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి, పది అనంతరం ఉన్న వివిధ కోర్సులపై వీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నాయుడు విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం ఝరాసంగం మండలం కుప్పానగర్ ఉన్నాత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు హైదరాబాద్‌లోని బాచుపల్లి వీఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల బృందం పరీక్ష సామగ్రి (ప్యాడ్లు, పెన్నులు) లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశం, వీఎన్ఆర్ కళాశాల బృందం, పాఠశాల సిబ్బంది, స్థానికులు రాజుస్వామి, రాజరత్నం, దేవిపుత్ర, తుల్జారాం,కార్తిక్, సతీశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

బొల్లారం పారిశ్రామికవాడలోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన ప్రహరీ

జిన్నారం (బొల్లారం) జనవరి 25: జిన్నారం మండలం బొల్లారం పారిశ్రామిక వాడలోని ప్రభుత్వ భూములు దురాక్రమణకు గురవుతున్నాయని ఐఎన్టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామికవాడలోని సర్వే నెంబర్ 175లో 4 ఎకరాల 10 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు కుట్ర పన్నారని ఆరోపించారు. ఇప్పటికే ఈ భూములను అక్రమంగా హస్తగతం చేసుకొని ప్రహరీ నిర్మించారని చెప్పారు. ఐదేండ్లుగా ఇంటి నిర్మాణం పేరిట తక్కువ మొత్తంలో ఆస్తి పన్ను చెల్లిస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. కబ్జాదారులు ఏకంగా ప్రహరీ నిర్మించి గోదాం ఏర్పాటు చేసినా మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. పారిశ్రామిక వాడలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందన్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు మొద్దు నిద్రను వీడి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. బాధ్యులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలకు జవాబుదారీగా పనిచేశాం

బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

జిన్నారం(బొల్లారం) జనవరి 25: ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజలకు జవాబుదారీగా బాధ్యతలు నిర్వర్తించి సంతృప్తితో పదవీ కాలాన్ని ముగించడం సంతోషంగా ఉందని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ తాత్కాలిక సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన కౌన్సిల్ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ...పాలకమండలి పదవి కాలంలో బొల్లారం ముంచిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. బీఆర్ఎస్ హయాంలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధిని పరుగులు పెట్టించామని చెప్పారు. దాదాపు ఐదేండ్ల కాలంలో దాదాపు రూ.150 కోట్లతో మున్సిపాలిటీని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. సహకరించిన మాజీమంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిలతోపాటు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులకు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మంగతాయారు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి, మేనేజర్ మల్లికార్జున్, ఆర్వో నర్సింహులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకవర్గ సభ్యులతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డిని సన్మానిస్తున్న బొల్లారం కమిషనర్ మంగతాయారు, అధికారులు

ఘనంగా గోదా రంగనాథస్వామి కల్యాణం



రంగనాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సతీమణి పద్మినిరెడ్డి

అందోల్, జనవరి 25: అందోల్‌లోని భూనీల సమేత రంగనాథస్వామి ఆలయంలో శనివారం గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో... దేవతామూర్తులను పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. ఉత్సవాల్లో స్థానికులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున్న పాల్గొన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి పద్మినిరెడ్డి పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

గుమ్మడిదల, జనవరి 25: పేద కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి శనివారం ఆర్థికసాయం అందించారు. మండలంలోని కానుకుంటలో రావుల కల్పన అనారోగ్యంతో మృతి చెందింది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆ పేద కుటుంబానికి తక్షణ సాయంగా రూ.5 వేలు పంపించారు. ఈ సాయాన్ని బీఆర్ఎస్ నాయకుడు నక్క వెంకటేశ్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ముద్రికాచారి, గండగళ్ల వెంకటేశ్, లసంగళ్ల యాదగిరి, రావుల మహేశ్, నాగరాజు అందజేశారు.

వ్యక్తి అదృశ్యం

హత్నూర, జనవరి 25: వ్యక్తి అదృశ్యమైన ఘటన హత్నూర మండలం రెడ్డిఖానాపూర్‌లో చోటుచేసుకుంది. హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన మాలె నారాయణ మూడేండ్ల క్రితం రెడ్డిఖానాపూర్‌లోని ఎఫ్‌పీవో కార్యాలయంలో సీఈవోగా పనిచేస్తూ అదే గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. శుక్రవారం బోర్పట్ల గ్రామంలో పనివుందని చెప్పి తన ద్విచక్ర వాహనం టీఎస్17 సి 4864 పై వెళ్లి తిరిగిరాలేదు. నారాయణ భార్య మాలె లక్ష్మి బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

ఉద్యోగోన్నతి పొందిన రాజుకు స్టార్ అందజేస్తున్న ఎస్పీ రూపేశ్

రాజుకు ఉద్యోగోన్నతి

గుమ్మడిదల, జనవరి 25: గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న డీఎస్ రాజు ఎస్సైగా ఉద్యోగోన్నతి పొందారు. శనివారం సంగారెడ్డి జిల్లా ఎస్పీ సీహెచ్ రూపేశ్ డీఎస్ రాజుకు స్టార్ అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. గుమ్మడిదల ఠాణా ఎస్సై మహేశ్వర్‌రెడ్డి నూతనంగా ఎస్సై బాధ్యతలు స్వీకరించిన రాజును అభినందించారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

స్పీడ్ బ్రేకర్లను పరిశీలిస్తున్న ఎస్ఐ నరేశ్

ఝరాసంగం, జనవరి 25 : మండల పరిధిలోని మాచనూర్ గ్రామ సమీపంలో నిమ్జ్ రోడ్డు కూడలి వద్ద శనివారం ఎస్ఐ నరేశ్ రోడ్డుకు ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. జహీరాబాద్ నుంచి ఝరాసంగం వైపు ప్రతిరోజూ వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. నూతనంగా నిర్మించిన నిమ్జ్ రోడ్డు కూడలి వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుడదని స్పీడ్ బ్రేకర్లు వేయిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా రోడ్డు దాటాలని సూచించారు.

ఎల్ వోసీ అందజేత

ఝరాసంగం, జనవరి 25: నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని, ఎవరూ అధైర్యపడొద్దని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. శనివారం మాచనూర్ గ్రామానికి చెందిన దేవమ్మకు అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికింద రూ.2.50 లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే మాణిక్‌రావు సహకారంతో మండల పరిధిలోని ప్యారవరం గ్రామానికి చెందిన బేగరి అరుణ్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఉప సర్పంచ్ మాణిక్యాదవ్, మాజీ సర్పంచ్ తనయుడు రాజు అందజేశారు.

పరిశ్రమ పనులు ఆపాలి

కోహీర్, జనవరి 25: గ్యాస్ పరిశ్రమను ఏర్పాటు చేస్తే చాలా ఇబ్బందులు వస్తాయని మద్రి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మద్రి గ్రామంలో టొరెంట్ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను వారు నిలిపివేశారు. రైతుల పొలాల మధ్య గ్యాస్ కంపెనీని ఏర్పాటు చేయడంతోపాటు ఇండ్ల పక్క నుంచి పైపులైను ఏర్పాటు చేసేందుకు గుంతలను తవ్వారన్నారు. పనులను పూర్తిగా నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. బీజేపీ నాయకురాలు జ్యోతి పండాల్ గ్రామస్తులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, లక్ష్మణ్, మొగులయ్య, నర్సింహులు, మల్లేశం, తదితరులున్నారు.